

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## రోడ్డుప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి




**నెల్లూరు క్రైమ్, జూలై27, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి జిల్లాకు విచ్చేసి నగరంలోని స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యొక్క భౌగోళిక స్థితిగతులు, పోలీసు స్టేషన్‌లు, అధికారుల వివరాలు, శాంతి భద్రతలు, పెండింగ్ కేసుల వివరాలు, సిబ్బంది సంక్షేమానికి తీసుకున్న చర్యలు, తదితర అంశాల గురించి డీజీపీకి ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు సంవత్సరాల కాలంలో క్రైమ్ ఏ విధంగా ఉందో పరిశీలించారు. నేర నియంత్రణకు తీసుకోవాల్సిన విషయాలపై పోలీసు అధికారులకు పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో గత మూడు సంవత్సరాలతో పోలిస్తే 6 నెలల కాలంలో నేరాల గణనీయంగా తగ్గాయని తెలిపారు. నేరాలు తగ్గించడమే ముఖ్య లక్ష్యమని, శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాడీలీ ఆఫెన్స్, మర్డర్, డౌరీ డెత్, హత్యప్రయత్నాలు మొదలైన గ్రేవ్ క్రైమ్ 30శాతం తగ్గాయని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 8శాతం, ఫోక్సో కేసులు 6 శాతం ప్రాపర్టీ నేరాలు 5 శాతం తగ్గినట్లు వెల్లడించారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణకు బీట్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ అన్ని జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సైబర్ నేరాలు, లోన్ యాప్, బ్యాంక్ పాస్‌వర్డ్, అకౌంట్ హ్యాకింగ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, నేరాల తగ్గుదలకు ప్రధానకారణం దిశ యాప్, దిశ యాప్‌తో ముఖ్యంగా మహిళలపై నేరాలు చాలా వరకు తగ్గాయని అన్నారు. దిశా యాప్ విస్తృతంగా డౌన్‌లోడ్ చేయించామని, 14400 నెంబరు యాప్ ద్వారా కరప్షన్ అరికడుతూ దాడులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ ఏర్పాటు చేశామని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా ఇప్పటికే 62శాతం రేట్ కన్విక్షన్ వచ్చాయని తెలిపారు. లోక్ అదాలత్ కక్షిదారులు భాగా సద్వినియోగం చేసుకున్నారన్నారు. పోలీసు యంత్రాంగం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందన్నారు. రౌడీ మూకలపై, అక్రమ మద్యం రవాణా చేసే గ్యాంగ్‌లు, గంజాయి అక్రమ రవాణా, విక్రయదారులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హిమవతి, క్రైమ్ ఎస్పీ ప్రసాద్, అన్ని సబ్ డివిజన్‌ల పోలీసు అధికారులు, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి జగనన్న సురక్ష ద్వారా సంక్షేమ పథకాలు



**నెల్లూరు కార్పొరేషన్, జూలై27, ప్రభాతవార్త** ప్రజా సమస్యలకు పరిష్కారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జగనన్న సురక్ష పథకంతో సంక్షేమం సాధ్యమని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్‌లోని బర్మా షెల్ గుంట, భగత్‌సింగ్ కాలనీ ప్రాంతాలు, రూరల్ నియోజకవర్గం పరిధిలోని 12,24,36,37వ డివిజన్‌ల్లోని అల్లీపురం, చింతారెడ్డిపాలెం, బారెల్ల వీధి, కనుపర్తి పాడు, కల్లూరుపల్లి, శ్రీలంక కాలనీ, బ్రహ్మానందపురం, మూలాపేట, పత్తేఖాన్‌పేట, ఓల్డ్ మిలిటరీ కాలనీ, రామ్ నగర్ ప్రాంతాల్లో జగనన్న సురక్ష కేంద్రాలను నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమీషనర్ పొగ్గని మంజూరు చేసిన టోకన్ల ఆధారంగా లబ్దిదారులకు వివిధ ధృవపత్రాలు అందజేశారు. అదే విధంగా జగనన్న సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్ సెంటర్, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. సచివాలయ శిబిరాలలో ఏర్పాటు చేసిన స్పందన కౌంటర్, హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్‌ల ద్వారా అన్ని రకాల సేవలను అందిస్తున్నామని వెల్లడించారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా మొత్తం 11 సేవలను అందిస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు(కుల, నివాస ధృవీకరణ పత్రాలు), ఆదాయ ధృవీకరణ పత్రం, జనన మరణ ధృవీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికేట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నెంబరు అప్‌డేట్, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్లు తొలగింపు, చేర్పు లాంటి సేవలను అందించామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో విజయ డెయిరి చైర్మన్ రంగారెడ్డి, స్థానిక డివిజన్‌ల కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ చెన్నుడు, అదనపు కమీషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్, అన్ని విభాగాల అధికారులు, సచివాలయాల కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల కష్టాలు తీర్చేందుకే సంక్షేమ పథకాలు అమలు




**నెల్లూరు అర్బన్, జూలై27, ప్రభాతవార్త** జిల్లాప్రజాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నెల్లూరు రూరల్ మండల, సౌత్ మోపూరు గ్రామ సచివాలయం నందు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రజల కష్టాలను తీర్చాలని సద్దుద్దేశంతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ లబ్దిని, నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతినిధుల తోటి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కలిసి ప్రతి ఇంటిని సందర్శించి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వార 11 రకాల సర్టిఫికేట్లు సత్వర పరిష్కారం కోసం మండల స్థాయి అధికారులచే గ్రామ సచివాలయాలలో శిబిరాలు నిర్వహించి వాటిని వెంటనే పరిష్కరించడం జరుగుతుంది. గ్రామ ప్రజలు అధికారులకు, మీ సమస్యలను తెల్పి. ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారములు చేయుట ద్వారా, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, ఎంపీడీఓ, తహశీల్దార్, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## రద్దు అజెండాలపై న్యాయ పోరాటం చేస్తా

- మేయర్ స్రవంతిజయవర్ధన్
- కౌన్సిల్ జనరల్ బాడీ ఆమోదం పొందిన 31 అజెండాలు రద్దు ఉత్తర్వులు
- రూ.7 కోట్ల 38 లక్షల నగరాభివృద్ధి పనులు రద్దు బాధాకరం



**నెల్లూరు కార్పొరేషన్, జూలై27, ప్రభాతవార్త** నెల్లూరు నగర పాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 24న జరిగిన సర్వసభ్య సమావేశంలో మెజార్టీ సభ్యుల ఆమోదంతో అనుమతులు పొందిన అభివృద్ధి పనులలోని 31 అజెండాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ జూన్ 13వ తేదీన రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల ఆదేశాల ప్రకారం కమీషనర్ వికాస్ మర్మత్ జూలై 25న రద్దు చేసినట్లుగా వెల్లడించారని గురువారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేయర్ స్రవంతి జయవర్ధన్ న్యాయ పోరాటం చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని సంబంధిత విభాగాల నుంచి వచ్చిన వినతులను గత కౌన్సిల్‌లో ఆమోదించబడి, అన్ని అనుమతులు మంజూరు కాబడి, గ్రౌండింగ్ లెవల్‌లో జరుగుతున్న కొన్ని అభివృద్ధి పనులపై కొందరు స్థానిక వైసీపీ కార్పొరేటర్లు, డిసెట్ నోట్ ఇవ్వడం, అభివృద్ధిని అడ్డుకోవడం అని బాధను వ్యక్తపరిచారు. ఆమోదం పొంది, రద్దు చేసిన 31 అజెండా నగరాభివృద్ధి పనుల విలువ రూ.7 కోట్ల 38 లక్షల రూపాయలు తెలిపారు. ప్రజా ప్రయోజనాల నిమిత్తం అన్ని డివిజన్‌లో డ్రెయిన్ కాలువలు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి క్షేత్ర స్థాయిలో పనులను పూర్తి చేయనున్న సమయంలో అర్థాంతరంగా రద్దు చేయడం శోచనీయం అని మేయర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు వినతుల మేరకు డివిజన్ల వారీగా అవసరమైన అభివృద్ధి పనులకు కౌన్సిల్ సమావేశంలో సభ్యులందరి సమక్షంలో ఆమోదం తెలిపిన పనులను వెంటనే ప్రారంభించేలా అనుమతులు కూడా మంజూరు చేశామన్నారు. నగర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులలో తమకు ఏ మాత్రం స్వార్థం లేదని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నిజాయితీగా నెరవేర్చేందుకే మేయర్‌గా బాధ్యతలు చేపట్టామని స్పష్టం చేశారు. ఎక్కడైనా అభివృద్ధి పనులు జరగడం కోసం ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తారే తప్ప ఉద్దేశపూర్వకంగా కొందరు మాత్రం శాంక్షన్ చేసినటువంటి అభివృద్ధి పనులను కౌన్సిల్ చేయమని చెప్పడం, ఫిర్యాదు చేయడం చాలా దారుణమైనటువంటి విషయమని, ఈ విషయాన్ని ప్రజలందరూ కూడా గమనించాలని కోరారు. ఈ అంశంపై భవిష్యత్తులో అన్ని రకాలుగా న్యాయ పోరాటం చేస్తామని మేయర్ స్పష్టం చేశారు.

## 31న స్పందన కార్యక్రమం రద్దు

**నెల్లూరు అర్బన్, జూలై 27, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలో ఈనెల 29వ తేదీ నుండి 5 రోజుల పాటు రొట్టెల పండుగ జరగనున్న సందర్భంగా ఈనెల 31వ తేదీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో, నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో జరుగు జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. రొట్టెల పండుగ విధి నిర్వహణలో జిల్లా అధికారులు పాల్గొనుచున్నందున జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు ఈ మార్పును గమణించి అర్జీలను తీసుకొని జిల్లా కేంరదానికి రావద్దని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మినహాయించి జిల్లాలోని అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని తెలిపారు.

# పేద విద్యార్థులకు వరం జగనన్న విదేశీ విద్య పథకం




**నెల్లూరు, అర్బన్, జూలై 27, ప్రభాతవార్త** పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విదేశీ విద్య వరంలాంటిదని, జగనన్న విదేశీ విద్య పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యనభయసించేందుకు జిల్లా నుంచి 19 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి ఈ విడతలో రూ.2.67 కోట్ల మేర లబ్ధి చూకూరనుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. గురువారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగనన్న విదేశి విద్య నిధులను విడుదల చేయగా, నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కనప్రాంగణం నుంచి వర్చువల్‌గా జడ్పీచైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతి, జిల్లా అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విదేశీ విద్యా పథకం వల్ల జిల్లా నుంచి ఎంతో మంది ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశాల్లో విద్యనభ్యసించే అవకాశం కలగడం ఒక వరం లాంటిదన్నారు. మంచి ప్రతిభతో విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో సీటు పొందిన పేద విద్యార్థులకు పూర్తి ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు విమాన, వీసా ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుందని కలెక్టర్ చెప్పారు. పేద విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

**విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులుః ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి**

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రాధమిక విద్య నుంచి విదేశీ విద్య వరకు తల్లిదండ్రులకు ఎటువంటి భారం లేకుండా అమ్మ ఒడి, విద్యాకానుక, ఫీజు రియింబర్స్‌మెంట్, విదేశీ విద్య వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. నాడు-నేడు పథకంతో పాఠశాలల రూపు రేఖలన్ని మారిపోయాయయని, డిగ్రీ విద్యార్థులకు పూర్తి స్థాయి ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు ఖర్చులకు వసతి దీవెన పథకం ద్వారా ఏడాదికి రూ.20వేలు అందిస్తూ విద్యార్థుల ఉన్నత చదువులకు ముఖ్యమంత్రి భరోసా కల్పించారన్నారు. గత ప్రభుత్వంలో విదేశీ విద్య ద్వారా కొంత మందికి మాత్రమే రూ.10 నుంచి రూ.15లక్షల వరకు అరకొరగా ఫీజులు చెల్లించేవారని, దీంతో ఆ డబ్బులు ఖర్చులకే అయిపోయేవని, డబ్బులు చాలక విదేశాల్లో విద్యార్థులు పెట్రోల్ బంకుల్లో, చిన్న చిన్న పనులు చేసుకుంటూ, ఫీజులు చెల్లించలేక తిరిగి వచ్చేసేవారని చెప్పారు. గతానికంటే భిన్నంగా ప్రపంచంలోని టాప్ 100 యూనివర్సిటీల్లో ర్యాంకులు పొందిన విద్యార్థులందరికి రూ.1.25 కోట్ల వరకు పూర్తి స్థాయిలో ఫీజులు చెల్లిస్తూ, విమాన, వీసా ఖర్చులు కూడా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. విద్యార్థులందరూ కూడా ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తులో ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ ఘనతను చాటాలని, పదిమందికి ఉపయోగపడేలా సేవా భావం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు రమేష్, వెంకటయ్య, నిర్మలాదేవి, మందా రాణి, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లైనర్ ఆక్సిలీరేటర్ యంత్రాన్ని ప్రారంభించిన వైవి సుబ్బారెడ్డి



**నెల్లూరు జూలై 27, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు పొదలకూరు రోడ్డులో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగులకు రేడియేషన్ ఇచ్చేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన లైనర్ ఆక్సిలీరేటర్ యంత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రెడ్‌క్రాస్ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో రేడియేషన్ థెరపీ కోసం ఈ యంత్రం అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ యంత్రంతో క్యాన్సర్‌ను చాలా తగ్గించవచ్చన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో అన్ని విభాగాలు కలిగిన పూర్తిస్థాయి అడ్వాన్సు క్యాన్సర్ ఆసుపత్రిగా ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. సిటీ స్కాన్, కొత్త రేడియేషన్ వార్డు, ఐసీయు వార్డును కూడా ప్రారంభం అవడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. వీటితోపాటు ఎంఎస్ సెంబకార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ దాతృత్వంతో సుమారుగా కోటి రూపాయల ఖర్చుతో 150కేవీఏ సామర్థ్యం కలిగిన సోలార్ పవర్‌ను విరాళంగా అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే మరోదాత కిరణ్‌కుమార్‌రెడ్డి ఆసుపత్రి బాధితులకు సరిపడా త్రాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సేవలన్నీ అందుబాటులోకి తీసుకురావడంతో క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగులకు సకల సౌకర్యాలతో కూడిన వైద్యం కూడా అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, రాష్ట్ర వైఎస్సార్‌సిపీ సేవాదళ్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, స్వర్ణ వెంకయ్య, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శివసునీల్‌రెడ్డి, చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్‌రెడ్డి, డాక్టర్ సునీల్, రావు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నలుగురు ముద్దాయిలపై పిడి యాక్ట్



**నెల్లూరు క్రైమ్, జూలై27, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో వివిధ పోలీసు అండ్ ఎస్ఈబీ కేసులలో ముద్దాయిలైన నలుగురుపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని బొడిగాడి తోటకు చెందిర అరవ చిన్నరాజు(30)పై కోవూరు, నవాబ్ పేట, కావలి ఎస్ఈబీ స్టేషన్స్ నందు కేసులు నమోదు అయినట్లు కందుకూరు టౌన్‌కు చేదిన గురునాధం చిన్న వెంకటేశ్వర్లు(47)పై కందుకూరు టౌన్ నందు రెండు, కందుకూరు ఎస్ఈబీ స్టేషన్స్ నందు కేసులు నమోదు అయినట్లు, నెల్లూరు నగరంలోని కపాడిపాలెంకు చెందిన షేక్ జమీర్(32)పై సంతపేట నందు రెండు, నెల్లూరు ఎస్ఈబీ నందు రెండు, కావలి ఎస్ఈబీ స్టేషన్స్ నందు కేసులు నమోదు అయినట్లు, నెల్లూరు నగరంలోని వెంగళరావు నగర్‌కు చెందిన షేక్ సలీం(44)పై నెల్లూరు ఎస్ఈబీ నందు రెండు, కావలి ఎస్ఈబీ స్టేషన్స్ నందు కేసులు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకం, సేవించడం లాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతలు, యువత భవిష్యత్ పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి భద్రతలపై ప్రభావం పడే విధంగా తీవ్ర నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ పెట్టడం జరుగుతుంది. వారందరూ తక్షణం నేర ప్రవృత్తికి ముగింపు పలికి, జనజీవన స్రవంతిలో కలవాలని, కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని జీవితాన్ని సాఫీగా కొనసాగించాలని హితవు పలికారు. నేరస్తుల కదలికలు, వారి కార్యకలాపాలను అడుగడుగునా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుంది. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకోబడతాయని వివరించారు. పోలీసులతో పాటు ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని, మీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకం, సేవించడం జరిగినట్లయితే 14500కానీ డయల్ 100, 112లకు లేదా దగ్గరల్లోని పోలీసు వారి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## భక్తుల రవాణా సౌకర్యాలకు ఆటోలు అందుబాటులో ఉండాలి



**నెల్లూరు కార్పొరేషన్, జూలై 27, ప్రభాతవార్త** బారా షహీద్ దర్గా రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యాల అందుబాటు కోసం ఉప రవాణా శాఖ కమీషనర్ కార్యాలయంలో ప్రాంతీయ రవాణా శాఖ అధికారి శ్రీచందన, మోటార్ వాహనాల తనిఖీ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర జిల్లాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా వారిని జాగ్రత్తగా రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల నుంచి అధిక ఛార్జీ వసూళ్లు చేయకుండా తీసుకెళ్లాలని ప్రాంతీయ రవాణా శాఖాధికారి శ్రీచందన యూనియన్ నాయకులకు సూచనలు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్ళడం, మద్యం సేవించి వాహనాలు నడపటం, అతి వేగంగా వెళ్లడం చేయరాదన్నారు. ఈసందర్భంగా అటువంటి వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మోటారు వాహన తనిఖీ అధికారులను ఆదేశించారు. రొట్టెల పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలిగించరాదని తెలిపారు. యజమానులతో మోటారు వాహనాల తనిఖీ అధికారి మురళీమోహన్ మాట్లాడుతూ ఆటో, ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల యజమానులు బారా సాహెబ్ దర్గా రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా వాహనాలను నడపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారులు మురళీకృష్ణ, శ్రీకార్తీక్ పవన్ కుమార్, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## వైభవంగా కోటి కుంకుమార్చన మహాయజ్ఞం



**బుచ్చి జులై 26 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో జరుగుతున్న కోటి కుంకుమార్చన మహాయజ్ఞం తొమ్మిదోవ రోజుకు చేరుకుంది. ఉభయకర్తలకు ఆహ్వానంతో కార్యక్రమం ప్రారంభం అయింది. మొదట గోపూజ, వృషబార్చన, లక్ష్మీగణపతిపూజ, స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి నవావరణపూజ, కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయింత్రం కౌమారి పూజ, సుహాసిన పూజ, శ్రీవార్ల శాంతి కళ్యాణం, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా హైదరాబాద్‌కు చెందిన బండి లక్ష్మీనసారెడ్డి దంపతులు, ఎఎస్‌పేట మండలం రాజోలు కి చెందిన చిట్టుమూరు వెంకటరెడ్డి దంపతులు ,దామరమడుగు కి చెందిన శ్రీనివాసులు వ్యవహారించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు దంపతులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. ఉచిత ప్రసాదాలు, అన్నప్రసాదాలు అందజేశారు.

# రొట్టెల పండుగకు ముస్తాబైన బారాషహీద్ దర్గా

- ముమ్మరంగా ఏర్పాట్లు
- భక్తుల రాకతో మొదలైన సందడి





**నెల్లూరుటౌన్, జూలై 27, ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రొట్టెల పండుగకు నెల్లూరు బారాషహీద్ దర్గా ముస్తాబయింది. పలు దుకాణాల ఏర్పాటుతో పాటు భక్తుల రాకతో దర్గా పరిసర ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. సరికొత్త రంగులతో దర్గా కట్టడాలు నూతన శోభను సంతరించుకున్నాయి. దుర్గాపురం ప్రాంగణమంతా శోభాయమానంగా అలంకరించారు. దర్గాలను పరిసర ప్రాంతాలను రంగులతో నూతన అలంకరణ కల్పించారు. అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లను చకచకా పూర్తి చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద బారికేడ్లతో పటిష్ట ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో జల్లు స్థానాలను కూడా పవర్‌ల ద్వారా ఏర్పాటు చేశారు. రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్రవేశ మార్గాలను, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లకు ఇబ్బందులు పడకుండా శాశ్వతంగా ఉన్న మరుగుదొడ్లతో పాటు తాత్కాలికంగా పలు ప్రాంతాల్లో మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. వర్షం వస్తే భక్తులకు ఇబ్బందులు లేకుండా భారీ టెంట్లను ఏర్పాటు చేశారు. భక్తులందరికీ తాగునీటి సౌకర్యం కల్పించేందుకు దర్గా ప్రాంతాల్లో మంచినీటి కొళాయిలను నిర్మించారు. విద్యుత్ సౌకర్యం ఇబ్బంది లేకుండా జనరేటర్‌లను అందుబాటులో ఉంచారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలను జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## సహృదయ ఫౌండేషన్‌చే నిత్యావసర వస్తువులు పంపిణీ



**బిట్రగుంట, జులై 27 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు ఆదరణ కేంద్రంలో కావలికి చెందిన శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాధలకు అవసరమైన నిత్యావసర వస్తువులు, పౌష్టికాహారం గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికికోవూరుపల్లి పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ సీమాతబాసు ముఖ్యఅతిధిగా పాల్గొని నిత్యావసర వస్తువులను ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె.సింహాద్రిరావుకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సహృదయ ఫౌండేషన్ నిర్వాహకురాలు తాడివాక బిందు అమెరికాలో వుండి ఇక్కడ ఆదరణ కేంద్రంలో సాయం అందించడం అభినందనీయమన్నారు. శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు పొన్నగంటి మాధవి ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ అనాధలకు అండగా వుండటం ఎంతైనా ప్రశంసనీయమన్నారు. ట్రస్ట్ కార్యదర్శి కమలకుమార్, ట్రస్ట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి



**కావలి రూరల్, జులై 27 ప్రభాతవార్త** హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు కావలి పట్టణంలోని వెంగళరావునగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎలిమెంటరీ పాఠశాలకు 15 వాటర్ క్యాన్లు, హైస్కూలుకు ఐదు వాటర్ క్యాన్లు దాత వైరింగం కల్లయ్య సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెండవ పట్టణ ఎస్ఐ బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ కలలు కనండి ఆ కలలను సాకారం చేసుకోండి అని అబ్దుల్ కలాం ఎప్పుడు అంటుండేవారని ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా చేస్తున్న సేవలను కొనియాడారు. వారికి నా సహాయ సహకారాలు ఎల్లవేళలా వుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోళ్ళ అమరజ్యోతి, హ్యాపీ సేవా సంస్థ సలహాదారుడు చేవూరు ప్రభయ్య, ఉపాధ్యక్షులు విజయ్, సభ్యులు చాంద్‌బాషా, నౌషద్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, షేక్‌మాబూ మస్తాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డాక్టర్ అబ్దుల్ కలాం మార్గదర్శకుడు



**కావలి రూరల్, జులై 27 ప్రభాతవార్త** భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం విద్యార్థులకు మార్గదర్శకుడని డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. కావలి డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడుతూ అత్యున్నత సేవలందించి సాంకేతిక, రాజకీయ రంగాల్లో రాణించి భారత మిస్సైల్ మ్యాన్‌గా పేరుగాంచి దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న అందుకున్న గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఏడు గౌరవ డాక్టరేట్లు పొందిన ఎ.పి.జె.అబ్దుల్ కలాం పోఖ్రాన్ అణుపరీక్షలలో కీలక పాత్ర పోషించారన్నారు. ఇండియా మై డ్రీం లాంటి పుస్తకాలతో పాటు తన జీవిత చరిత్రను తెలిపే వింగ్స్ ఆఫ్ ఫైర్‌ని రచించారని తెలిపారు. ఆయన దేశానికి చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు, పరిపాలనాధికారి జి.రమేష్‌బాబు, యు.వి.సుజల, అన్ని విభాగాలధిపతులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## దొంగ ఓట్లు తొలగించకపోతే అధికారుల గుండెల్లో నిద్రపోతాం



**కావలి, జులై 27 ప్రభాతవార్త** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఓటర్ల పరిశీలనలో వైసిపి చేర్చిన దొంగ ఓట్లను తొలగించకపోతే అధికారుల గుండెల్లో నిద్రపోతామని, తప్పు చేసిన ఏ అధికారిని వదిలిపెట్టేది లేదని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. కావలి టిడిపి కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాలేపాటి పాల్గొని మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లను గుర్తించామని బూత్ వారీగా దొంగ ఓట్లను బహిర్గతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఓటర్ల జాబితా పరిశీలన, సవరణ, దొంగ ఓట్లు తొలగించడంలో బిఎల్‌వోలు సహకరించడం లేదని ఆయన ఆరోపించారు. బిఎల్‌వోలు, రాజకీయ పార్టీలు నియమించిన సహాయకులతో కలిసి ఓటర్ల జాబితా సవరణ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు వున్నాయన్నారు. అయితే బిఎల్‌వోలు సహరించడం లేదన్నారు. తమ పార్టీలకు చెందిన సహాయకులు వెళితే బిఎల్‌వోలు తమకు పనులు వున్నాయంటూ దాట వేస్తున్నారన్నారు. ఇప్పటికి వారం రోజులు కావస్తున్నా ఓటర్ల జాబితాకి సంబంధించి సవరణలు జరగడం లేదన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్లకు ఫిర్యాదులు చేస్తామన్నారు. అధికారులు చిత్తశుద్ధితో దొంగ ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సియం జగన్మోహన్‌రెడ్డి దొంగ ఓట్ల రాజకీయానికి స్వస్తి పలకాలన్నారు. నిజాయితీ కల్గిన ఓట్లతో రాజకీయం చేయాలన్నారు. ప్రశ్నిస్తే దౌర్జన్యం, రౌడీయిజం, తప్పుడు కేసులు, దొంగతనం కేసులు పెట్టడం ఈ వైసిపి నేతలకే దక్కిందన్నారు. సమయం దగ్గర పడుతోంది వీరి ఆటలు సాగవని మాలేపాటి హెచ్చరికలు చేశారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించి దొంగ ఓట్లను తొలగించకపోతే జనంతో ఆర్డీవో కార్యాలయానికి వెళతామని మాలేపాటి హెచ్చరించారు. దళితులంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపు అన్నారు. కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండలంలో ఈ నెల 13వ తేది దళితుడు తన పట్టా భూమిలో నాలుగు ట్రాక్టర్లు గ్రావెల్ తోలుకుంటుంటే వైసిపి నేతలు తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేశారన్నారు. నేటికీ విడుదల చేయలేదన్నారు. కావలి పట్టణంలో ప్రతి రోజు 200 ట్రాక్టర్ల పైగా గ్రావెల్ అక్రమంగా తరలిపోతుంటే పట్టుకోవడం కానీ కేసులు పెట్టడం గానీ జరగడం లేదన్నారు. దళితులపై ఈ వివక్షత ఏమిటన్నారు. మైనింగ్ శాఖ ఆదాయానికి కోట్లాది రూపాయలు గండిపడుతుందన్నారు. కావలి నియోజకవర్గం నుంచి ప్రభుత్వానికి వందలాది కోట్లు నష్టం వాటిల్లుతోందని ఈ అవినీతి డబ్బు వైసిపి నేతల జేబుల్లోకి వెళ్తుందని దుయ్యబట్టారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుందని ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెబుతారని మాలేపాటి హెచ్చరికలు చేశారు. ఈ సమావేశంలో టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోట్లూరు శ్రీనివాసులు, టిడిపి జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరినాయుడు, పట్టణ టిడిపి ఉపాధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, టిడిపి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆత్మకూరి నాగరాజు, మైనార్టీ సెల్ రాష్ట్ర నేత ఎస్.కె.మస్తాన్, టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు ఆరోగ్యానికి హానికరం

**నెల్లూరు జులై 27, ప్రభాతవార్త-వైద్యం** పొగాకు ఉత్పత్తుల వాడడం వల్ల ఆరోగ్యానికి హానికరమని మెడికల్ అధికారి షేక్ సమీరా పేర్కొన్నారు. గురువారం నగరంలోని యుహెచ్‌సి పరిధి వెంగమాంబ వీధిలో జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంటు డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగించడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు సంభిస్తాయని వాటికి దూరంగా ఉండాలని సమీరా పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగత్రాగడం నిషేదమని, 18 ఏళ్ల వయస్సులోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను అమ్మరాదన్నారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేదమని అలా అమ్మిన పక్షంలో జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీసీపీ సోషల్ వర్కర్ ఎం హాసిని సూపర్‌వైజర్ జి వెంకటేశ్వర్లు, ఏఎస్ఐలు శ్రీహరిరెడ్డి, కోటేశ్వర్‌రావు, యుహెచ్‌సి కోఆర్డినేటర్ విజయలక్ష్మి, సురేఖ, ఉమామహేశ్వరిలు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభ్యున్నతే ముఖ్యమంత్రి ధ్యేయం



**వరికుంటపాడు, జులై 27, ప్రభాతవార్త :** సంక్షేమ పథకాల తో పేద ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారనీ వరికుంటపాడు జెడ్పిటీసీ సభ్యుడు రావెళ్ళ నాగేంద్ర, వైకాపా మండల కన్వీనర్ అంట్రా బాలగురవారెడ్డి లు అన్నారు. వరికుంటపాడు సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యాక్రమము సర్పంచ్ కొండెపోగు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటీసీ సభ్యుడు రావెళ్ళ నాగేంద్ర మాట్లాడుతూ జగనన్న సురక్షలో కార్యక్రమములో భాగంగా మండలంలో సుమారు 7 వేల మందికి వివిధ రకాల సంక్షేమ పథకాలకు సంబందించి ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారని, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారనీ కొనియాడారు. ఈ కార్యక్రమములో వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, ఎంపిడిఓ విజయ్‌భాస్కర్‌రావు, తహశీల్ధార్ సయ్యద్ ఇక్బాల్, పంచాయతీ కార్యదర్శి సికిందర్, సిహెచ్‌వో రాజశేఖర్‌రాజు, పిహెచ్ఎన్ సుశీలమ్మ, వర్కు ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, విఆర్ఓ శేషారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా ...ఒకరికి తీవ్ర గాయాలు

**వరికుంటపాడు, జులై 27, ప్రభాతవార్త :** జాతీయ రహదారి పై వేగంగా వెళుతున్న ఆటో బోల్తా పడి, వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రాన్ని సమీపంలో గల కోల్డ్‌స్టోరేజి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు దుత్తలూరు మండలం నందిపాడుకు చెందిన బోగ్యం కోటయ్య తన ఆటోలో మరో వ్యక్తిని పామూరు వైద్యశాలకు తీసుకువెళుతుండగా, రహదారి పై ఉన్న గుంతను తప్పించబోయి, అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న బోగ్యం కోటయ్యకు ఎడమచేయి, ఎడమ కాలు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై తన సిబ్బంది తో హుటాహుటిన సంఘటన స్థలానికి క్షత గాత్రులను జాతీయ రహదారి అంబులెన్సులో చికిత్స నిమిత్తం పామూరు కు తరలించారు.



## నేటినుండి ఎమ్మెల్యే "మేకపాటి" పర్యటన

**మర్రిపాడు, జులై27ప్రభాతవార్త:** ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం నుండి నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటిస్తారని ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈనెల28వతేదీ, 29వతేదీ సాయంత్రం 4గంటలకు ఆత్మకూరు పట్టణంలోని ఏసిఎస్ఆర్‌కాలనీ పరిదిలోని సచివాయంలో గడపగడపకుమన ప్రభుత్వం కార్యకమంలో ఎమ్మెల్యే పాలొ ్గంటారన్నారు. 17,19,20వార్డులకు సంబంధించి ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల30, 31తేదీల్లో సాయంత్రం 4గంటలకు అనంతసాగరం మండలం సోమశిల సచివాలయ పరిధిలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో విక్రమ్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఆగస్టు1వ తేదీన ఉదయం 10గంటలకు చేజర్ల మండలపరిషత్ కార్యాలయంలో జరుగు సమీక్షా సమా వే శంలో ఎమ్మెల్యే పాల్గొంటారని, ఆగస్టు 1,2తేదీల్లో సాయంత్రం 4గంటలకు ఏఎస్‌పేట మండలం శ్రీకొ లను సచివాయ పరిధిలో జరిగే గడపగడపకుమనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమాలకు ఆయావార్డు, గ్రామాలవైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సచివా లయ సిబ్బంది, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు తదితరులంతా పాల్గొనాలని వారు కోరారు.

## టిడిపి కార్యకర్త కుటుంబానికి కాకర్ల ఆర్ధికసహాయం



**ఉదయగిరి జులై 27 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని కృష్ణంపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మిరియాల నారాయణ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. కార్యకర్త మృతి చెందిన విషయాన్ని తెలుగుదేశం పార్టీ మండల ప్రధానకార్యదర్శి గోపవరం చిన్న రమణారెడ్డి, తెలుగుదేశం పార్టీనాయకులు కాకర్ల సురేష్ దృష్టికి తీసుకొనిరాగా స్పందించిన ఆయన స్ధానిక నాయకుల ద్వారా ఆ కుటుంబానికి 20 వేల రూపాయాలు తక్షణ ఆర్ధిక సహాయాన్ని అందించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనాయకులు సింగనబోయిన సుబ్బరాయుడు, కల్లూరు సుబ్బారెడ్డి గ్రామస్తులు పాల్గోన్నారు.

## మోడి పాలనలోనే రైతులకు పెద్ద ఎత్తున రాయితీలు



**బుచ్చి జులై 27 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రధాన మంత్రికిసాన్ సమృద్ధి కేంద్రంలో బిజెపి కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో నరేంద్రమోడీ రైతుల ఖాతాల్లో 15వ విడత పిఎం కిసాన్ నగదు జమ చేసు రైతులకు ఎంతో ప్రయోజనకరమైన సల్ఫర్ కోటెడ్ యూరియా లాంచ్ చేస్తున్న సందర్భంగా రైతులతో కలిసి నరేంద్రమోడీ ప్రసంగాన్ని వీక్షిస్తు నాయకులు ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ బిజెపి నాయకులు ఇనుగూరు బాలయ్య మాట్లాడుతు భారతప్రధాని నరేంద్రమోడీ రైతులకు అనేక రాయితీలు ఇస్తున్నారని అందులో భాగంగానే నానో యూరియా సల్ఫర్ కోటెడ్ యూరియా అందిస్తున్నారని తెలిపారు. దేశంలోని రైతులందరికి సమృద్ధిగా యూరియా అందించేందుకు వీలౌతుందని ఆయన తెలిపారు. అనంతరం భారతీయ జనతాపార్టీ కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చేవూరు నారాయణ మా ట్లాడుతు నీమ్ యూరియా తయారు చేయడం వల్ల బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేయవచ్చునని అన్నారు. కాంప్లెక్స్ ఎరువులను యాభైశాతం సబ్సిడితో రైతులకు అందిస్తున్నారని, దేశవ్యాప్తంగా రైతుల ఖాతాలో ప్రతి సంవత్సరం ఆరువేల రూపాయాలు నగదు ఉచితంగా జమ చేస్తున్నారని తెలిపారు. నిత్యం రైతులకోసం ఆలోచించే నాయకుడు నరేంద్రమోడీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాచవరం శ్రీనివాసులు, వన్నెపంట బాలిరెడ్డి, కోప్పోలు మస్తానయ్య, పెద్ది సుమంత్, కిసాన్ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యులు బొర్రు అంకయ్య, యువమోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు మహిమలూరు ప్రవీణ్‌కుమార్, యువ మోర్చ మండలాద్యక్షులు గండి పెంచలక్రిష్ణా, మండల ప్రధానకార్యదర్శి తాల్లపరెడ్డి శివకుమర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## మహాశక్తి ర్యాలీ ప్రారంభం



**కోవూరు జులై 27 ప్రభాతవార్త :** కోవూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రాంగణంలో గురువారం మహిళా శక్తి వాహనాన్ని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ మహాశక్తి కార్యక్రమం ద్వారా మహిళాభివృద్ధికి టీడీపీ అమలు చేస్తున్న పలు మహిళా పథకాలపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా మహిళలు తగు చొరవ తీసుకుంటారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, అమరేంద్రరెడ్డి, వీరేంద్ర, టీడీపీ నేతలు సీహెచ్ కృష్ణచైతన్య, బాలరవి, నాటకరాణి వెంకట్, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, మాజీ ఎంపీపీ వై. వెంకటరమణమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు స్నేహలత, మహేష్, గోవిందు, తదితరులు ఉన్నారు.

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాటలను నమ్మవద్దు



**కోవూరు జులై 27 ప్రభాతవార్త :** నాలుగు సంవత్సరాల పాటు రాష్ట్రంలో ఎక్కడా కనిపించకుండా పోయిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఎన్నికల తేదీ దగ్గర పడే సరికి పగటి వేషగాళ్ల మాదిరిగా ప్రజల్లో ప్రత్యక్షమవుతున్నారని, అటువంటి వారి మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండలం కోనమ్మతోట 5వ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు గానీ, పింఛన్లు కానీ పొందాలంటే జన్మభూమి కమిటీకి ముడుపులు ఇస్తేనే మంజూరయ్యేవని, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉంటే పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు, పింఛన్లు మంజూరవుతూన్నయన్నారు. గతంలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి వేకువజామునే తలుపు తట్టి ఇంటి దగ్గరకే పింఛన్లు ఇస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. చంద్రబాబు నాయుడు రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే పవన్ కళ్యాణ్ మాట్లాడతాడే తప్ప ఆయన స్వతహాగా ఏదీ మాట్లాడరన్నారు. ప్రస్తుతం ప్రజలకు వస్తున్న అన్ని సంక్షేమ పథకాలు నిరంతరం పొందాలంటే మరలా వైసీపీ ప్రభుత్వం వస్తేనే ఉంటాయని, ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి వస్తే ఇవన్నీ ఆగిపోతాయన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా అనేక సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయని, సాధ్యమైనంత వరకు వాటిని తన తండ్రి ఎన్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా పరిష్కారం చేసేలా చర్యలు తీసుకున్నారనానరు. కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏ పథకం ప్రవేశపెట్టినా అది ఒక చరిత్రే అన్నారు. సచివాలయ , వలంటీర్ వ్యస్థ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటికే తెచ్చి భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శమయ్యారన్నారు. అతి చిన్న వయస్సులోనే పెద్ద మనస్సుతో మానిఫెస్టోలో చెప్పిన ప్రతి అంశాన్ని క్రమం తప్పకుండా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. అది చూసి జీర్ణించుకోలేక చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌లు లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఈ సందర్భంగా ఆయన మహిళలను కోరారు. అనంతరం 939 దృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. పద్మజ, ఎంపీడీవో శ్రీహరి,, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మైను ద్దీన్, ఈవోపీఆర్డీ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వైసీపీ నేతలు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జుబేర్‌బాషా, వెంకటరమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ కె. ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు రాజగోపాల్, వంశీ, నాగరాజు, శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రాథమిక దశ నుంచి ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలి



**కోవూరు జులై 27 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే నీతి కథలు , క్రమ శిక్షణ, పటుదల, తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని మండల విద్యాశాఖ అధికారి రహీమ్ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో గురువారం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కథలు చెబుతాం ఊ కొడతారా అనే అంశంపై విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ లేకపోతే ఉన్నత శిఖరాలు అధిహించలేరని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. టీటీడీ జిల్లా కోఆర్డినేటర్ స్వామినాయక్ మాట్లాడుతూ పాఠశాలల్లో ధర్మార్థ కామ మోక్ష నీతి కార్యక్రమాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకే ఇటువంటి కార్యక్రమాలను ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిలో దాగి ఉన్న అనేక నైపుణ్యాలను తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రధానంగా హైందవ ధర్మంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం , నీతి వాఖ్యాల ద్వారా వారిలో అవగాహన పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాన్కిఇ తమ పాఠశాల ఎంపిక చేసుకునేలా కృషి చేసిన మాజీ విద్యాకమిటీ చైర్మన్, టీటీడీ ధార్మిక సలహా మండలి సభ్యులు డాక్టర్ మిర్యాల వెంకటరమణయ్యను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి గెలుపు ఓటమిలను సమానంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ధార్మిక సలహా మండలి సభ్యులు డి. సురేంద్రబాబు, ఎస్. రవికుమార్, ఎన్. జయరామయ్య, డాక్టర్ వెంకయ్య, తదతరులు పలు సూచనలు చేశారు.

**విజేతలు వీరే..** పాఠశాలలో నిర్వహించిన కథలు చెబుతాం ఊ కొడతారా అనే వకృత్వ పోటీల్లో సీనియర్ విభాగంలో ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వై.సుప్రజ ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం ఎస్ సౌమ్య, తృతీయ స్థానం ఎన్. చైతన్యలు కైవసం చేసుకోగా.. జూనియర్ విభాగంలో ఇనమడుగు ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రథమ స్థానం బి. దీప్తి, ద్వితీయస్థానం వై. హాసిని, తృతీయ స్థానం సీహెచ్ వేదశ్రీలు గెలుపొందారు. వీరికి టీటీడీ జిల్లా కోఆర్డినేటర్ స్వామి నాయక్ చేతులమీదుగా నగదు పురస్కారాలను అందజేశారు.

## ప్రధానిమోది తపనంతా రైతన్నల వికాసంకోసమే



**జలదంకి, జులై27, ప్రభాతవార్తః** కర్షకుల వికాసం కోరి కోట్టాదిరూపాయలు సబ్సిడీ రూపంలో వెచ్చిస్తున్న ప్రధాని నరేంద్రమోది రైతు పక్షపాతిగా కీర్తింపబడుతున్నాడని భారతీయ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు చల్లాహనుమారెడ్డి పేర్కొన్నారు. గురువారం రైతాంగానికే ఉపయోగపడే విదంగ తయారైన నానో యూరియా, పి.ఎం కిసాన్ సమ్మాన్‌నిధి ప్రధాని నరేంద్రమోది ప్రారంభించిన నేపద్య కార్యక్రమ ప్రసారాన్ని మాద్యమాలద్వార తిలకించేందుకు ఆపార్టీ మండల నాయకులు, రైతులు స్తానిక బలాజి ఏజన్సీకి తరలివచ్చారు. ప్రధాని ప్రసంగ ఆసాంతం విన్న అనంతరం ఆయన మాట్లాడారు. నానో యూరియ దేశవ్యాప్తంగ అన్ని రైతుకేంద్రాలలో అందుబాటులోకి వస్తుందన్నారు. వ్యవసాయాలనకి ఇదిఎంతో ప్రయోజనకరంగ వుంటుందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను జగన్ ప్రభుత్వం దారిమళ్ళిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం 22లక్షల ఇళ్ళు ఇచ్చిందని వాటిలో వై.సి.పి ప్రభుత్వం ఎన్నిపూర్తిచేసిందో చెప్పాలని డిమాండ్‌చేశారు. మహాత్మాగాంధి జాతీయ ఉపాదిహామీ పదకంకింద కోట్లు కేటాయిస్తుంటే ప్రజలకు అవసరమైన ఉపయోగపడే పనులు చేయకుండా వాగులు వంకలులలో పనులు చేస్తుండడం మనరాష్ట్రానికే దక్కిందని ఎద్దేవచేశారు. ఇలా ఒకటేంటి మంజూరవుతున్న నిదులలో వేలకోట్లు దోచేస్తున్నారని దుయ్యబట్టారు బొక్కడమే పనిగపెట్టుకున్న రాష్ట్ర నేతలు అందనంత ఎత్తుకు ఎదిగితే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశాడు. మండల పార్టీ అధ్యక్షుడు మారెళ్ళ బ్రహ్మారెడ్డి మాట్లాడుతు ఇవాళ యూరియ 266 రూపాయలకే అందించిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని కొనియాడారు. మిగతా సబ్సిడి కేంద్రం భరిస్తు రైతు సంక్షేమాన్ని కోరుకుంటుందన్నారు. యుకెలో బస్తాధర 2000ఉంటే మనకిక్కడ తక్కువధరకు రావడం విశేషమన్నారు. ఎందుకంటే రైతలు వ్యవసాయ ఖర్చు బరాయించలేరని కేంద్రం ఈనిర్ణయం తీసుకుందని తెలిపారు. రాబోయే కాలంలో వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతున్నారని వివరించాడు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి తదితరాలను తమ కార్యకర్తలు నాయకులు ప్రజలలోకి తీసుకెళ్ళేందుకు చర్యలు చేపడతామని తెలియజేశాడు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకుడు బండారు తిరుపతిరెడ్డి, బి.జె.వై.ఎం రాష్ట్ర సోషల్‌మీడియా కోకన్వీనర్ వద్దే శ్రీనాద్‌రెడ్డి, మండల యువమోర్చా అధ్యక్షుడు వంటేరు రాకేష్, పార్టీ ప్రధానకార్యదర్శి కంచర్ల శరత్‌బాబు, మండల ఎస్.సి సెల్ అధ్యక్షుడు బలభద్ర ప్రభాకర్, రామాల కృష్ణారెడ్డి, చిర్రా రాధాకృష్ణారెడ్డి, పువ్వాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొహరం అన్నప్రసాదానికి ఎమ్మెల్యే "మేకపాటి" విరాళం



**మర్రిపాడు, జూలై27ప్రభాతవార్త:** సంగం మం డలం జెండాదిబ్బ గ్రామంలో జరుగుతున్న మొ హరం వేడుకల నిర్వహణలో అన్నప్రసాదానికి ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి వితరణతో తనవంతుగా 25 వేల రూపాయల విరాళాన్ని వేడుకల నిర్వాహకులకు అంద జేశారు. సంగం మండల వైసిపి నాయకులు, జెండాదిబ్బ గ్రామ ముస్లింమైనారిటి నాయకులు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్ళి ఈ వేడుకలకు విక్రమ్‌రెడ్డిని ఆ హ్వానించారు. ఈసందర్భంగా ఆయన మొహర ం వేడుకల గురించి అడిగి తెలుసుకున్నారు. తనవంతుగా ఈ వేడుకల్లో అన్నప్రసాదానికిగాను 25వేల రూపాయల విరాళాన్ని వారికి అందజేశారు. వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన వారికి సూచించారు. మొహరం వేడుకల్లో యువత బాధ్యతగా వ్యవహరిస్తున్నారని, అందరూ ప్రశాంతంగా ఈపండుగ వేడుకలను జరుపుకోవాలని విక్రమ్‌రెడ్డి సూచించారు. నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న ముస్లింయూత్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

## సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధిపై పార్లమెంటులో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ, జూలై27, ప్రభాతవార్త** విశాఖపట్నం తదితర తీర ప్రాంతాల అభివృద్ధి పర్యవేక్షణపై కేంద్రం తీసుకుంటున్న చర్యలు వివరించాల్సిందిగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంబంధిత శాఖ మంత్రిని పార్లమెంటు సమావేశాల సందర్భంగా కోరారు. నిపుణుల అంచనాల ప్రకారం సుమారు 30 శాతం తీర ప్రాంతం కోతకు గురికావడాన్ని ప్రభుత్వం ఏ విధంగా పరిశీ లిస్తుందో సమగ్ర ప్రణాళికను వివరించాలని కోరారు. విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్, ముంబై మెరైన్ డ్రైవ్‌లా మారుతుందనే నిపుణుల అభిప్రాయానికి సం బంధించి వివరణను తెలుపమని ప్రశ్నించారు. స్పందించిన కేంద్ర మంత్రి కిరెన్ రిజుజు నిసికిత పూర్వక సమాధానం ఇస్తూ నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్(ఎన్‌సీసీఆర్) నిర్వహించిన అధ్యయనం ప్రకారం, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్(ఎంఈఎస్) కార్యాలయం మేరకు విశాఖపట్నం జిల్లా తీరప్రాంతంలో 19శాతం కోతకు గురవుతుందని, 43శాతం వృద్ధి చెందుతుందని(పెరుగుతున్నది) మిగిలిన 38శాతం స్థిరమైన స్థితిలో ఉందని తెలిపారు. విశాఖపట్నం నగరానికి 22శాతం తీరప్రాంతం కోతకు గురి అవుతుందని అన్నారు. అదే విధంగా కేరళలోని పుదుచ్చేరి, చెల్లానం వద్ద ఎన్‌సీసీఆర్ వినూత్నమైన తీర ప్రాంత కోతను తగ్గించే చర్యలను, పునరుద్ధరణ, తీర రక్షనను విజయవంతంగా ప్రదర్శించిందన్నారు. తీరప్రాంత రాష్ట్రాలకు సాంకేతిక సహకారం, నిర్వహణ కోసం ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. విశాఖపట్నం ఓడరేవుల నుండి డ్రెడ్జ్ చేయబడిన ఇసుకతో బీచ్ పోషణ సాధ్యమవుతుందన్నారు. ఆర్కేబీచ్ వద్ద మరింత కోతకు గురికాకుండా తీర రక్షణ ప్రణాళికను రూపొందించాలన్నారు.

## కోటి రూపాయలతో కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ అభివృద్ధి పనులు



**నెల్లూరుసిటీ, జూలై27, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో అభివృద్ధి పనులకు కోసం కోటీ రూపాయల నిధులు కేటాయించేందుకు సిద్ధమని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఘనంగా జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నగర కమీషనర్ వికాస్ మర్మత్ తదితరులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లూరుపల్లిలో సమస్యల పరిష్కారానికి ఇప్పటికే 20 లక్షలు కేటాయించామని తెలిపారు. సమస్యల తీవ్రత దృష్ట్యా 30 లక్షలు రూపాయలు కార్పొరేషన్ నుంచి కేటాయించమని కమీషనర్‌ను కోరామని, ఎంపీ నిధుల నుంచి మరో రూ.50లక్షల రూపాయలను కేటాయించి మొత్తంగా కోటి రూపాయలను అభివృద్ధి పనులకు వినియోగిస్తామని ప్రకటించారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో అర్హులందరికి పారదర్శకంగా లబ్ది చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశమని అందరూ సద్వినియోగంచేసుకోవాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమాలకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, తమను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. విజయడెయిరి చైర్మన్ రంగారెడ్డి, మున్సిపల్ కమీషనర్ వికాస్ మర్మత్, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మొయిళ్ళ గౌరీ, సత్తార్, మూలే విజయభాస్కర్‌రెడ్డి, అవినాష్, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు నూనె మల్లిఖార్జున యాదవ్, వైసీపీ నేతలు స్వర్ణవెంకయ్య, పాతపాటి పుల్లారెడ్డి, సురేష్‌రెడ్డి, పాలకీర్తి రవి, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో ముద్దాయికి జైలు శిక్ష, జరిమాన



**నెల్లూరు క్రైమ్, జూలై27, ప్రభాతవార్త** గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేసి ముద్దాయిలకి కఠిన శిక్షలు పడేలా చేస్తున్న నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి, కావలి రూరల్ మండల పరిధిలోని కొత్తపల్లిలో జరిగిన ఫోక్సో కేసులో ముద్దాయికి 20సంవత్సరాల జైలు శిక్ష, రూ.22వేలు జరిమానను నెల్లూరు తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి విధించారు. 2020 ఏప్రిల్ 30న 15సంవత్సరాల బాలికను కావలి రూరల్ మండల కొత్తపల్లి గ్రామానికి చెందిన మానికల గణేష్(30) సమీప పొలాలలోనికి తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కావలి రూరల్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడమైంది. తగిన సాక్ష్యాలను పొందుబరచగా ప్రాసిక్యూషన్ వారు నేరం రుజువుచేయడంతో గురువారం నాడు తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టువారు ముద్దాయికి 20సంవత్సరాల జైలు శిక్ష, రూ.22వేలు జరిమాన విధించ డం జరిగింది. ఈ కేసును అప్పటి కావలి రూరల్ సీఐ పి.అక్కేశ్వరరావు దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పైకేసులలో వాదించడంలో ప్రతిభ కనపరిచిన అడిషనల్ పీపీ ఆర్.అరుణకుమారిని, కేసువిచారణ, సాక్ష్యాలు పొందుపరచడంలో ప్రతిభ కనపరిచిన విచారణ అధికారి కావలి పి.అక్కేశ్వరరావుని, కోర్టు మానిటరింగ్ ఎస్సై దేవిడ్‌దాస్‌ని, కోర్టు సిబ్బందిని పీసీ శ్రీకాంత్‌ని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అభినందించారు.

## కామాక్షితాయి బంగారు పాదాలు భద్రమే



**బుచ్చి జూలై 27 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో అమ్మవారి బంగారు పాదాలు భద్రంగానే వున్నాయని ప్రధానార్చకులు గంగాప్రసాద్‌స్వామి ,ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. కోటి కుంకుమార్చన సందర్భంగా నిత్యం అమ్మవారి పాదాలు పైన కుంకుమ పోయడం జరుగుతుందని గంగా ప్రసాద్‌స్వామి తెలిపారు.అమ్మవారి పాదాలు కుంకుమతో నిండిపోయి ఉన్నాయని కుంకుమ ఎక్కువగా ఉన్నందువల్ల అమ్మవారి పాదాలు కనిపించవని తెలిపారు. కొందరు కావాలని అమ్మవారి పాదాలు కనిపించడంలేదన్న పుకార్లు భక్తులు నమ్మవద్దని అమ్మవారి బంగారు పాదాలు మీడియాకు చూపించారు.ఇటువంటి పుకార్లు భక్తులు నమవద్దని అన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు శుక్రవారం అమ్మవారికి శాఖాంబారి అలంకారం ఉంటుందని తెలిపారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.భక్తులు పెద్దఎత్తున పాల్గోని అమ్మవారిని దర్శించుకొని తరించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే 29 వ తేది అమ్మవారికి హోమం జరుగుతుందని తెలిపారు. కామాక్షితాయి మన మధ్యలోనే సంతోషంగా తిరుగుతుందని చెప్పారు.భక్తులు పెద్దఎత్తున ఈకార్యక్రమంలో పాల్గోని అమ్మవారి కృపకు పాత్రలు కావాలని వారు పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో పాలక మండలి సభ్యులు తిరువాయిపాంటి నందకుమార్, కో ఆప్షన్ మెంబర్ శశిశేఖర్ శర్మ ఉన్నారు.

## రైతు బాంధవుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి



**కొడవలూరు జూలై27 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలిచి, రైతుల పాలిట రైతు బంధవుడిగా ఉన్నారు అని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి. కొడవలూరు మండలం, కమ్మపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని సంజీవనగర్ చంద్రశేఖరపురం నందు గురువారం గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజాపరిషత్ నిధుల ద్వారా చంద్రశేఖరపురంలో 35లక్షల రూపాయలతో సైడ్ డ్రయిన్స్‌కు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మిడియాతో ఆయన మాట్లాడుతూ ఒక్క కమ్మపాలెంగ్రామ పంచాయితీకి సంబంధించి నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్మోహరెడ్డి పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఖాతాలలో బటన్ నొక్కి నేరుగా 16కోట్ల 61లక్షల 36వేల రూపాయలు వేశారు అని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి మెనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇంకపాతే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీటి పారుదల విషయంలో జగన్మోహన్‌రెడ్డిని ప్రాజెక్ట్‌లకు సంబందించి నిర్లక్ష్యం చేశారని విమర్శించారు, అని తెలిపారు. ముఖ్యమంత్రిగా తోమ్మిదేళ్ల పాలనలో చంద్రబాబు నాయుడు ఏమి చేశారు నీటిపారుదల శాఖకు అని ప్రశ్నించారు. ప్రమాణశ్రీకారం చేసిన వెంటే ఉచిత కరెంట్ సంబంధించిన ఫైల్ పై సంతకం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనిఆడేరు. అంతేకాక జలయజ్ఞం పేరుతో ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ఆయన వారసుడిగా ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి రైతులకు అండగా రైతుభరోసా పెట్టాం, ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, రైతాంగానికి పెద్దపీఠం వేసి, రైతు బంధవుడిగా నిలిచారు అని తెలిపారు. నెల్లూరు బ్యారేజ్, సంగం బ్యారేజ్‌ను, కృష్ణపట్నం పోర్టు స్యాక్షన్ చేసి, ప్రారంభించింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని అతని వారసుడుగా జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు బ్యారేజ్, సంగం బ్యారేజ్‌ను ప్రారంభించారని, ఈ విషయని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని చంద్రబాబా నాయుడుకి ఎదేవా చేశారు. ప్రజలకు చెప్పింది చేస్తున్నాము, కాబట్టి ఎప్పుడు ఎలక్షన్స్ వచ్చినా ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలిని ఆశిస్తునారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ వీరి చలపతిరావు కూడా మాట్లాడేరు ఈ కార్యక్రమంలో కమ్మపాలెంగ్రామ నాయకులు బెల్లం వెంకయ్యానాయుడు, బెల్లం నగేష్‌నాయుడు, వెంకట నగేష్ బాబు, బెల్లం సందీప్, ఎపిటీసి అరుణ కుమారి, సర్పంచ్ లక్ష్మయ్య, కొమ్మి రమేష్‌నాయుడు, గరికి మస్తానయ్య, తలతాటి తిరపతయ్య, తలతాటి ప్రసన్నకుమార్, మండల కన్వీనర్ గంధంవెంకటశేషయ్య, సచివాలయం కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ గాలి జ్యోతి, తహసీల్దారు రమాదేవి, ఎపిడీవో సుబ్రహ్మణ్యం, ఎస్సై సుబ్బరావు, ఎఇలు, వ్యవసాయ అధికారి లక్ష్మీ, విద్యాధికారి వసంతకుమారి, ఎపిఎం రుక్మిణి, నాయకులు సనీల్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## రైతు అభ్యున్నతి కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్ నిధి



**కావలి, జులై 27 ప్రభాతవార్త** రైతు బలంగా వుంటేనే ఈ దేశం కూడా బలంగా వుంటుందన్న సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతుల అభ్యున్నతి కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్ నిధి ప్రవేశపెట్టారని బిజెపి జిల్లా అధ్యక్షులు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ తెలిపారు. కావలి పట్టణంలోని శ్రీ వీరరాఘవ ఫర్టిలైజర్స్ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన పియం కిసాన్ సమృద్ధి కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని గురువారం వీక్షించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భరత్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. రైతులు ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి వారని తెలిపారు. ప్రధానమంత్రి ఈ దేశంలో రైతు బాగుండాలని రైతు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. అందులో భాగంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్ నిధి క్రింద ప్రతి ఏట రైతుకు 6 వేల రూపాయలను మూడు విడతలుగా అందజేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పంటలు, భూసార పరీక్షలు చేసి ఏ పంట వేస్తే ఆదాయం బాగుంటుందన్న విషయాలను కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. దేశ వ్యాప్తంగా ఈ రోజు లక్షా 25 వేల ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారన్నారు. 8.5 కోట్ల మంది రైతులకు 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధి కింద మొత్తం 17 వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఆఫ్ ట్రేడ్ మెంబర్, బిజెపి రాష్ట్ర నేత కందుకూరి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు న్యాయం జరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కిసాన్ సమృద్ధి కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తెచ్చారన్నారు. పనిముట్ల సేవలు అన్ని ఒకే చోట దొరికే విధంగా ఈ కేంద్రాలు పనిచే స్తాయన్నారు. రైతులందరూ ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, ఎడి నాగరాజు, బచ్చు వీరాస్వామి, బచ్చు ఏడుకొండలు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి అంచిపాక కమల, బిజెవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిశెట్టి నరేంద్ర, పరుసు వెంకటేశ్వర్లు, బెల్లంకొండ మాల్యాద్రి, మాజీ అసెంబ్లీ కన్వీనర్ సి.వి. సి.సత్యం, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మురళీకృష్ణనాయుడు, మందా కిరణ్‌కుమార్, తూమాటి తిరుపతిస్వామి, ముంగమూరు వెంకటరెడ్డి, కోడూరు మురళి, మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి శ్రీదేవి, కిసాన్ మోర్చ రాష్ట్ర సోషల్ మీడియా కోకన్వీనర్ మర్రిబోయిన అనిత, కూరాకుల సవీంద్ర, కటకం మనోజ్‌కుమార్, సన్నిగంటి శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిల్ సమక్షంలో పలువురు వైసీపీలో చేరిక



**నెల్లూరు సిటీ, జూలై27, ప్రభాతవార్త** మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ సమక్షంలో పలు పార్టీలకు చెందిన నేతలు వైసీపీలో చేరారు. నెల్లూరు నగర నియోజకవర్గం 53వ డివిజన్‌కు చెందిన టీడీపీ మాజీ అధ్యక్షులు దేవరకొండ ఆదిశేషయ్య, టీడీపీ నాయకులు నల్లబోయి మల్లిఖార్జున్ వారి మిత్రబృందం, బీజేపీ నాయకులు దాసరి శ్రీను, వారి మిత్రబృందం సీపీఎం పార్టీ నాయకులు రాగా శీనయ్య, వారి మిత్రబృందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమరగిరి రమణయ్య వారి మిత్రబృందం సుమారు 100మంది నగరంలోని రాజన్న భవన్ నందు నగర శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ అందిస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్న వారందరికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ సుజాత, దేవరకొండ అక్షయ్‌బాబు, చాచల్ చంటి, కోనేటి గోపాల్, దాసరి రవీంద్రబాబు, నల్లగొండ్ల అరుణ్, దాసరి రమణయ్య, దాసరి యేసు, మేకల రాజమ్మ, రాగాల భాగ్యలక్ష్మీ, అమాస నారాయణమ్మ, కావాడి రాజా, కే.భాగ్యలక్ష్మీ, వైసీపీ నాయకులు, బాగి వెంకటరమణ పాల్గొన్నారు.

## రైతుపై అడవిపంది దాడి

**సైదాపురం జూలై 27 ప్రభాతవార్త** మండల పరిధిలోని చీకుపోలు గ్రామానికి చెందిన పి కోటయ్య అనే రైతుపై గురువారం అడివిపంది దాడి చేసింది.కోటయ్య కు చెందిన నిమ్మతోటలో పనిచేస్తుండగా అడివిపంది ఆయనపై దాడి చేయడంతో తీవ్రగాయాలు అయ్యాయి.దీంతో స్దానికులు 108 సమాచారం అందించడంతో వెంటనే వారు సంఘటనా స్దలానికి చేరుకొని చికిత్స నిమిత్త ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## జగనన్న సురక్ష కార్యక్రమం

**ముత్తుకూరు, జూలై27, ప్రభాతవార్త** గురువారం ముత్తుకూరు మండలం తాళ్లపూడి, మామిడిపూడి పంచాయతీ పరిధిలోని తాళ్లపూడి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు కావలసిన వివిధ రకాల సర్టిఫికెట్స్, రేషన్ కార్డు,కౌలు రైతుల కార్డులు,రైతులకు సంబంధించి జీలగులు పంపిణీ చేయడం జరిగింది.ఈకార్యక్రమంలో జడ్పిటిసి వెంకటసుబ్బయ్య,ఎంపీపీ గన్నవరం సుగుణమ్మ,ఎంపీటీసీ,ఎమ్మార్వో,ఎంపీడీవో,మామిడిపూడి సర్పంచ్ కాకి మస్తానమ్మ,వైసీపీ సీనియర్ నాయకులు పద్మాభిరెడ్డి,గోపాల్,సచివాలయ కన్వీనర్ హరికృష్ణ,గౌస్‌భాషా,వైసీపీ నాయకులు కోట సుధీర్‌బాబు,నాగరాజు,గోనల సీనయ్య,తాళ్లపూడి సచివాలయ సిబ్బంది,మామిడిపూడి గ్రామ వాలంటీర్లు,గృహసారధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అధికార యంత్రాంగానికి అన్ని విధాల అండగా నిలుస్తాం



**నెల్లూరుటౌన్, జూలై 27, ప్రభాత వార్త:** ఈ నెల 29వ తేది నుంచి ప్రారంభమయ్యే బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ విజయవంతంగా జరిగేందుకు తనతో పాటు మేయర్ పొట్లూరి స్రవంతి ముస్లీం మత పెద్ద లు, కమిటీ సభ్యులు, సూచనలు, సలహాలతో త మ వంతుగా ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని అధికార యంత్రాంగానికి పూర్తి స్థాయిలో అండగా నిలిచి పండుగ విజయవంతం చేస్తామని నెల్లూరు గ్రా మీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొ న్నారు. గురువారం బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ ఏర్పాట్లను ఆయన నగర మేయర్ స్రవంతితో కలిసి పర్యవేక్షించారు. పవిత్ర బారాషహీద్ దర్గా నెల్లూరు రూ రల్‌లో ఉండడం, నెల్లూరు రూరల్‌కు తాను శాసనసభ్యుడిగా ఉండడం తన పూర్వజన్మ సుకృతంగా, అదృ ష్టంగా భావిస్తున్నానన్నారు. దాదాపు తనకు 15 సంవత్సరాల నుండి పవిత్ర బారాషహీద్ దర్గాతో బంధం , అనుబంధం ఉందని పవిత్ర బారాషహీద్ దర్గా విశ్వాసాలను పూర్తిగా నమ్మే వ్యక్తులలో తాను కూడా ఒకడని అన్నారు. గత నాలుగేళ్లుగా అధికార పార్టీ శాసనసభ్యుడిగా బారాషహీద్ దర్గా అభివృద్ధికి ఆ శక్తివంచన లేకుండా పని చేశానన్నారు. రొట్టెల పండుగ నిర్వహణలో ముస్లీం మతపెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులను అందరిని కలుపుకొని వారందరి సూచనలు, సలహాలతో గత నాలుగేళ్లుగా బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగను అద్భుతంగా చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈనాడు అధికారం లేని శాసనసభ్యుడిని అయినా రొట్టెల పండుగ బాగా జరగాలని రొట్టెలపండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను కోరుతున్నానని చెప్పారు. అధికార యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది.

## అంధుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



**నెల్లూరుటౌన్, జూలై 27, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలో ఉన్న విశ్వభారతి అంధుల పాఠశాలలో గురు వారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా సీనియర్ జడ్జి కె.వాణి ప్రత్యేక ప్రతిభ కలిగిన విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, విద్య, వసతి, సౌక ర్యాలపై నిర్వాహకులను, విద్యార్థులను విడివిడిగా అడిగి తెలుసుకున్నారు. జడ్జి పాఠశాలలోని విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఆధ్వర్యంలో గురువారం విశ్వభారతి అంధుల పాఠశాల ఏ.కే.నగర్ సందర్శిం చడం జరిగింది. ఈ సందర్భంగా కె.వాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలలందరూ వారి పుట్టు కతోనే కొన్ని ప్రాథమిక హక్కులను పొందడంతో పాటు తమ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమాజం, దేశం పట్ల కొన్ని విధులు, బాధ్యతలను కూడా కలిగి ఉన్నారని అలాగే భారత రాజ్యాంగం గురించి పిల్లలకు వివ రించారు. పిల్లలకు భోజన వసతులు, వైద్య సదుపాయం, ఆరోగ్య పరిస్థితులను, బట్టల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంకా మీకు ఏమైనా అవసరమైతే మా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించ వచ్చని తెలిపారు. తదుపరి పిల్లలకు బిస్కెట్లు పంచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.ప్రభావతమ్మ, మిగతా సిబ్బంది, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## హెపటైటిస్ ప్రాణాంతకమైన వ్యాధి



**నెల్లూరు జూలై 27, ప్రభాతవార్త-వైద్యం** ప్రస్తుత జీవనసరళిలో ఆహా రపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్ళు నిద్రలేమి లాంటి వాటితో మనిషి ప్రాణాంతకమైన హెపటైటిస్ వ్యాధి బారినపడే అవకాశాలు చాలా ఎ క్కువగా ఉన్నాయని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి షుగరు వ్యాధి నిపుణులు డాక్టర్ సింధు రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ను ఆసుపత్రిలో మెడికవర్ వైద్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధి సోకితే శరీరంలోని కాలే యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఏ, బి, సి, డి, ఇ లుగా ఈవ్యాధిని విభజించడం జరిగిందన్నారు. ఈ వ్యాధి తీవ్రత సిర్రోసిస్ దశకు చేరుకుని కాలేయం పూర్తిగా దెబ్బతింటుందని వివరించారు. ఈ ధరలోల కాలేయం మార్పిడి చేయాల్సి వస్తుందన్నారు. ఈ వ్యాధి అపరిశుభ్రవాతావరణం, కలుషితమైన నీరు, అధికంగా మురికివాడల్లోనూ హెపటైటిస్-బి నమోదు అవుతుందని తెలిపారు. ఈవ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే రోగిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటిస్ ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు లాంటి మద్యం సేవించడం వల్ల వస్తాయన్నారు. కామెర్లు, రక్తవాంతులు, విరోచనాలు, అలసట ఎక్కువగా ఉండటం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, క్రమక్రమంగా బరువు తగ్గిపోవడవ, కండరాలు, కీళ్ళనొప్పులు అధికంగా ఉండటం జ్వరం, కాళ్ళు, పొట్టవాపు, చర్మం, కళ్ళు పచ్చగా మారడం, నల్లరంగులో విరోచనాలు పగలు నిద్ర, రాత్రుల్లో మెలకువగా ఉండటం ఈవ్యాధి లక్షణాలన్నారు. ఈ వ్యాధి నివారణకు శాశ్వత చికిత్స లేదని, వ్యాధిగ్రస్తుడు ప్రతియేటా వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. వ్యాధి ముదిరిపోతే కాలేయం తప్పనిసరిగా మార్పిడి చేయాల్సి ఉంటుందని రవీంద్రరెడ్డి వెల్లడించారు.

## మేకపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం



**కందుకూరు, జూలై27, ప్రభాతవార్త** కందుకూరు రూరల్ జి.మేకపాడు గ్రామ సచివాలయంలో గురువారం కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11రకాల సేవలను ఉచితంగా అందించే బృహత్తర కార్యక్రమానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి సర్కారు శ్రీకారం చుట్టిందన్నారు.ఈ కార్యక్రమాన్ని నెల రోజులపాటు కొనసాగుతుందని,జూలై 1 నుండి ఆగస్టు 1వరకు అధికారులు సచివాలయ పరిధిలో క్యాంపులు నిర్వహించి ప్రజలకు అవసరమైన ధృవపత్రాలు జారీ చేస్తారు.సీఎం జగన్మోహన్‌రెడినడ అధికారం చేపట్టిన తర్వాత పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చి వాటిలో 99శాతం హామీలను పాదర్శకంగా అమలు చేయడం చూస్తునే ఉన్నామని,ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందించేలా వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమాల అమలు చేస్తున్న సంగతి అందరికీ తెలిసేందేనని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కందుకూరు మండల ఎంపీపీ ఇంటూరి సుశీల,జడ్పిటీసీ తొట్టెంపూడి అనసూయమ్మ,నాగేశ్వ ర్‌రెడ్డి,శివరామయ్య,వైసీపీ నాయకులు ,కన్వీనర్లు,వాలంటీర్లు,గృహసారధులు పాల్గొన్నారు.

### గ్రంధి సతీమణి లక్ష్మికుమారి ఉత్తరక్రియల్లో పాల్గొన్న పార్టీల నేతలు, అభిమానులు



**కావలి, జులై 27 ప్రభాతవార్త** కావలి మాజీ మున్సిపల్, మాజీ ఎయంసి చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి సతీమణి లక్ష్మికుమారి ఉత్తరక్రియల్లో గురువారం వివిధ పార్టీల నేతలు, అభిమానులు, వ్యాపారస్తులు, డాక్టర్లు పెద్దఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. గ్రంధి లక్ష్మికుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి, కాంగ్రెస్, బిజెపి,వైసిపి, సిపియం, సిపిఐ, సిపిఐయంయల్ పార్టీల నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రంధిని పరామర్శించారు. పట్టణంలోని వ్యాపారస్తులు, డాక్టర్లు, బంధువులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. గ్రంధితో వున్న సన్నిహిత సంబంధాలను చాటిచెప్పారు. మహిళలు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బస్సు చక్రాలకింద నలిగిన చిన్నారి



**మనుబోలు, జూలై27, ప్రభాతవార్త:** మండలంలోని మదనూరు గ్రామంలో గురువారం ఉదయం స్కూల్‌బస్సు చక్రాలకింద నలిగి అభం,శుభం తెలియని చిన్నారి ప్రాణాలు పోగొట్టుకున్నాడు.ఈఘటన ఆగ్రామంలో విషాదాన్ని నింపిందిం.పోలీసుల కధనంమేరకు వివరాలిలావున్నా యి.గూడూరుకు చెందిన సాయి విద్యానికేతన్‌బస్సు ప్రతిరోజు మదమ నూరుకువెళ్ళి విద్యా ర్ధులను స్కూలుకు తీసుకెళుతుంది.ఈప్రయత్నంలో మదనూరు గ్రామానికి బస్సు వెళ్ళింది.పిల్లల్ని బస్సు ఎక్కిస్తుండగఒతల్లి తన కుమార్తెలను బస్సు ఎక్కించింది.ఈప్రయత్నంలో సంకలోవున్న బిడ్డ ను కిందవదిలింది ఆబిడ్డ ఇం ట్లోకి వెళ్ళకుండ దోగాడుతు బస్సు కిందకి వెళ్ళాడు.ఆసమయంలో ఆచి న్నారి తల్లి బిడ్డను గమనించలేదు.డ్రైవర్ బస్సు ను ముందుకు నడిపా దు.క్ష ణాలలో బస్సు చక్రాలకింద సాయి సాత్విక్(2) రోడ్‌పై చితికాడు చిన్నారి మృతదేహం చూసిన తల్లితోపాటు గ్రామస్తులు గొల్లున కేకలు పెట్టారు.అప్పటికే ఘోరం జరిగిపోయింది .డ్రైవర్ పొరపాటా,తల్లి నిర్లక్ష్యమా అను కునేలోపు నిండుప్రాణం గాలిలో కలిసిపోయింది.వెంటనే పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకితీసుకొని బస్సు ను స్వాదీనం చేసు కున్నారు.చిన్నారి మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.బస్సు కు క్లీనర్ లేనందున ఇలా జరిగిందన్న చర్చ మొదలైంది. చిన్నారి మృతిపట్ల ఆగ్రామ సర్పంచ్ జానకమ్మ,ఎం.పి.టి.సి సుజాత మ్మ,సొసైటి ప్రసిడెంట్ ప్రదీప్‌రెడ్డి విగ్రాంతి వ్యక్తంచేస్తూ సానుభూతి ప్రకటించారు.